సాక్షి వనపర్తి

మంగళవారం, 9, మే, 2023



కోనసీమ.. పాలమూరు

పచ్చని పంటలతో పాలమూరు కోనసీమను తలపిస్తుందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸



రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు.

వివరాలు 10లో ▸


గరిష్టం/కనిష్టం
38.3 /27.4

వాతావరణం

ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. సాయంత్రం ఆకాశం తేలికపాటి మేఘావృతమవుతుంది. ఉక్కపోత పెడుతుంది.

మాటలకందని విషాదం..!

కుటుంబాల్లో కడుపుకోత మిగిల్చిన ఈత సరదా



చిన్న ఏమరుపాటు.. వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలోని బావులు, కాల్వలు, చెరువుల వద్ద సోమవారం చోటు చేసుకున్న మూడు వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి చెందడం కలచివేసింది. ఐదుగురు ఆడపిల్లలు కలిసి ఈతకు వెళ్లగా.. పెళ్లి కూతురు చెల్లెలితో పాటు మరో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడటంతో.. అప్పటి దాకా పెళ్లి భాజాలు మోగిన ఆ ఇంటి ముందు.. చావు దప్పు దిక్కులను పిక్కటిల్లేలా చేసింది.. మరోచోట దుస్తులు ఉతకడానికి వెళ్లిన ఘటనలో నీటిలో కొట్టుకుపోతున్న చెల్లెలిని కాపాడబోయిన ఇద్దరు అక్కలతో సహా ముగ్గురు మృత్యుఒడికి చేరారు. అలాగే తన పిల్లలకు ఈత నేర్పించేందుకు వెళ్లిన ఓ తల్లి నీట మునిగి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది.

– మరికల్/పెబ్బేర్ రూరల్/కోడేరు

ఉమ్మడి పాలమూరులో వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృత్యువాత

- తాటిపాములలో దుస్తులు ఉతికేందుకు వెళ్లిన..ముగ్గురు అక్కాచెల్లెళ్లను కబళించిన మృత్యువు
- కోడేరు మండలంలో బిడ్డలకు ఈత నేర్పేందుకు వెళ్లి కానరాని లోకాలకు తల్లి..
- పెళ్లింట విషాదం నింపిన మరో ప్రమాదం
- ఊకచెట్టు వాగులో ఈతకు వెళ్లిన పెళ్లికూతురు సోదరి, మరో ఇద్దరు అక్కాచెల్లెళ్లు మృతి

ఈత నేర్పించేందుకు వెళ్లి..

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బావాయిపల్లికి చెందిన లింగమ్మ(30) అనే మహిళ భర్త లింగస్వామితో కలిసి సోమవారం కూతురు కవితరాణి, కుమారుడు విజయేందర్‌కు గ్రామ శివారులోని బావిలో ఈత నేర్పించేందుకు వెళ్లారు. కొద్దిసేపు ఈత పడిన తర్వాత లింగస్వామి పిల్లలను తీసుకుని ఒడ్డుకు రాగా.. భార్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయింది. భర్త చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెతికినా ఆచూకీ లభించలేదు. కొల్లాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.



పెళ్లి ఇంట్లో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బలితీసుకున్న ఇసుక గుంతలు..



ముగ్గురు బాలికల ప్రాణాలను బలిగొన్న ఇసుక గుంత.. పక్కనే ఇసుక డంపు

ఎన్నో ఏళ్ల కిత్రం హైదరాబాద్ వలస వెళ్లి.. పెద్దకూతురు పెళ్లి కోసం స్వగ్రామానికి వచ్చిన ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. పెళ్లి కూతురు సోదరితో పాటు బంధువులకు చెందిన ఇద్దరు చిన్నారులు సరదాగా ఈతకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటనతో నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన భాగ్యమ్మ, అశోక్ దంపతుల పెద్ద కుమార్తె కావేరికి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తితో ఆదివారం వివాహం జరగగా.. సోమవారం ఉదయం పెళ్లి కూతురి చెల్లెలు రాధిక(16), మరో ఇద్దరు బాలికలు శ్రావని(15), మహేశ్వరి(14) ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. అయితే ఈ ఘటనకు వాగులో అడ్డదిడ్డంగా ఇసుక తవ్వడమే కారణమని గ్రామస్తుల ఆరోపించారు. రాకొండ శివారులో కోయిల్‌సాగర్ ఊకచెట్టు వాగు ఉండగా కొందరు అక్రమార్కులు ఇష్టానుసారంగా 20 నుంచి 30 ఫీట్ల లోతు వరకు వాగులో పొక్లెయిన్‌తో గుంతలు తవ్వారు. ప్రస్తుతం అవే గుంతలు ముగ్గురు బాలికల ప్రాణాలను బలి తీసుకోవడంతో ఇసుకాసురులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే కోయిల్‌సాగర్ వాగు పొడవునా వందల సంఖ్యలో ఇలాంటి గుంతలు ఉన్నాయి. వేసవిలో పిల్లలను అక్కడికి వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిరుపేద కుటుంబాలే..

భాగ్యమ్మ, అశోక్ దంపతులకు 5 మంది కుమార్తెలు కాగా.. సువర్ణ, గణేష్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిది రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. గ్రామంలో కూలీ పనులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. కుటుంబ పోషణ, పిల్లల చదువుల నిమిత్తం ఈ రెండు కుటుంబాలు కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అశోక్ పెద్ద కుమార్తె పెళ్లికి రాగా.. ఈత రూపంలో వెంటాడిన మృత్యువు ఆ రెండు కుటుంబాల్లోని ముగ్గురు బాలికలను బలి తీసుకోవడంతో తీరని శోకం మిగిలింది. మృతిచెందిన వారిలో రాధిక హైదరాబాద్‌లోని మోడల్ పోచంపాడ్ హాస్టల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా.. శ్రావణి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, మహేశ్వరి 8వ తరగతి చదువుతున్నారు. ముగ్గురు బాలికల మృతితో పచ్చని పెళ్లి ఇంట్లో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

చెల్లెలిని కాపాడబోయి.. ఇద్దరు అక్కలు

వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలోని వీరసముద్రం చెరువులో దుస్తులు ఉతకడానికి వెళ్లి ఈత రాక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు మృతిచెందారు. గ్రామానికి చెందిన గంధం కుర్మయ్య, భాగ్యమ్మ దంపతుల కూతురు తిరుపతమ్మ(16), సంధ్య(12), దీపిక(10) మృతిచెందారు. తాటిపాములలో చోటుచేసుకున్న ఈ ఘటన పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గ్రామానికి చేరుకుని ఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్లాటు, ఒకరికి పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా, ఇద్దరు చిన్నారులు ఇంటర్ వరకు ఉచితంగా చదువుకునేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, జిల్లా కార్యదర్శి రమేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎల్లస్వామి, ఇన్‌చార్జ్ చెన్నరాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నిండుప్రాణాలకు.. నీటి గండం

- అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం
- పెద్దవారి సమక్షంలోనే వెళ్లడం ఉత్తమం

- వివరాలు 8లో



న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

వనపర్తి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి అర్జీలపై గత కొన్ని వారాల నుంచి ఆయా శాఖల అధికారుల పనితీరు సంతృప్తిగా ఉందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ప్రజావాణి అర్జీలను వారంలోపే పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు సిఫారస్ చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం భోజన విరామం వరకు 86 అర్జీలు అందాయని గ్రీవెన్స్ సెల్ అధికారి శ్రీకాంత్‌రావు తెలిపారు. ఎక్కువగా భూసమస్యలపై ఉన్నట్లు తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు తొమ్మిది అర్జీలు..

సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తొమ్మిది అర్జీలు అందాయి. అర్జీదారులతో ఎస్పీ రక్షితా కె.మూర్తి స్వయంగా మాట్లాడారు. సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత ప్రాంత పోలీస్ అధికారులకు సిఫారసు చేశారు.

టెండర్ దరఖాస్తు తేదీ పొడిగింపు

వనపర్తి టౌన్: తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదేశానుసారం జిల్లాలోని మైనార్టీస్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 2023–24 విద్యాసంవత్సరానికిగాను నిత్యావసర సరుకుల సరఫరా టెండర్‌కు దరఖాస్తు తేదీని ఈనెల 14 వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా అధికారి ఎస్. పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కిరాణానికి రూ.3వేలు, ఇతర సరుకులకు రూ.వెయ్యిని డీయండబ్ల్యూఓ వనపర్తి పేరున ఈనెల 12వ తేదీలోగా డీడీ తీసి జిల్లా మైనార్టీస్ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని, టెండర్ ఫామ్‌ను పొందాలని సూచించారు. కిరాణానికి రూ.80వేలు, చికెన్ రూ.30వేలు, గుడ్లు, కూరగాయలు, పండ్లకు రూ.15వేలు (ఈఎండీ) డీడీని పైన తెలిపిన పేరున తీసి సంబంధిత విద్యాసంస్థలో సమర్పించాలని, ఆసక్తి గల వారు టెండర్‌లు వేయాలని పేర్కొన్నారు.

ఆలయాల భూములను పరిరక్షించాలి



ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలోని దేవాలయాల భూములను పరిరక్షించాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ తహసీల్దార్ సింధూజను కోరారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కౌన్సిలర్లతో కలసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 42 ఎకరాల భూమిని సర్వేచేయించి హద్దులను ఏర్పాటు చేయాలని, అలాగే శ్మశాన వాటికకు కేటాయించిన 16 ఎకరాల భూమికి, చెర్ల పరమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 39లోని శిఖం భూమిని పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పెన్షన్ ఇప్పించాలంటూ ఒకరు, తమ భూములను సర్వే చేయించాలని ఇద్దరు ప్రజావాణి సందర్భంగా వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను సత్వర్వమే పరిష్కరిస్తామని తహసీల్దార్ సింధూజ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది, మిల్లర్లు

వనపర్తి: ఆరుతడి పంటలైన కంది, వేరుశగ సాగుతోనే అధిక లాభాలు సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంత్రి వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయపరంగా మన జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని, రైతులు వరితో పాటు ఆరుతడి పంటలు, కూరగాయలు సాగుచేయాలని సూచించారు. ఈ విషయంపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలు కూరగాయల సాగు పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత యాసంగిలో ఒక్క వనపర్తి జిల్లాలోనే.. 1.69 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారన్నారు. టార్గెట్ 2023–24 ఉద్యానశాఖ పదివేల ఎకరాలు టార్గెట్‌గా నిర్దేశించుకుని మే నెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడారు. పంచాయతీ అవార్డు రాష్ట్రస్థాయిలో ఖిల్లాఘనపురం మండలం సోళీపూర్ గ్రామానికి రావటం శుభసూచకమన్నారు. జాతీయ అవార్డు రావడానికి కృషి చేయాలన్నారు. సీఎంఆర్ బియ్యం గడువులోగా మిల్లర్ల నుంచి సేకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ డీపీఓ సురేష్, హార్టికల్చర్ అధికారి సురేష్, డీఏఓ సుధాకర్‌రెడ్డి డీఎస్‌ఓ కొండలరావు, అధికారులు, రైస్‌మిల్లర్స్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలు అభివృద్ధి పథంలో సాగాలి

జిల్లాలోని గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకుసాగాలని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు సాధించుకున్న సోళీపురం గ్రామ సర్పంచ్ పద్మను సత్కరించారు.

పెండింగ్ కూలీ డబ్బులు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీల ధర్నా

మదనాపురం: పెండింగ్ కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం మదనాపురం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కొన్నూరులో మూడు నెలల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, ఇప్పటివరకు రూ.60 నుంచి రూ.70లు మాత్రమే రోజుకూలీకి వస్తుందని మండిపడ్డారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీఓ స్పందిస్తూ, రెండు, మూడు రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ప్రసాద్, వెంకటేష్, కూలీలు తిరుపతయ్య, రాములు, నరసింహ, భాగ్యమ్మ, మణెమ్మ, లక్ష్మమ్మ, మాసమ్మ, సరోజ, పీతల రాములు, గుడిసె మన్నెమ్మ, జానకమ్మ, వడ్డే నీలమ్మ, కొండన్న, గోకరమ్మ, జయమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు ఇంకెన్నాళ్లు..

- నందిమల్ల గ్రామస్తుల ధర్నా
- ఎస్ఐ చొరవతో రాస్తారోకో విరమణ



రాస్తారోకో చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు

అమరచింత: ఎనిమిది రోజులుగా సత్యసాయి తాగునీటి పథకం నుంచి 12 గ్రామాలకు తాగునీరు అందటం లేదంటూ సమీప గ్రామానికి చెందిన నందిమళ్ల గ్రామస్తులు సత్యసాయి పంప్‌హౌజ్ వద్ద జూరాల ప్రాజెక్టు రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఖాళీ బిందెలతో పంప్‌హౌజ్‌కు ఎదురుగా ప్రాజెక్టు ప్రధాన రహదారిపై బైఠాయించారు. తాగునీరు ఇచ్చేవరకు కదలబోమని స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు నందిమళ్ల సీపీఐ ప్రజాపంథా పార్టీ ఎంపీటీసీ హన్మంతు, పార్టీ నాయకులు మద్దతు తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎంపీటీసీ హన్మంతు మాట్లాడుతూ పీజేపీ క్యాంపు సమీపంలో ఉన్న సత్యసాయి వాటర్ సప్లయ్ పంపును మిషన్ భగీరథలో కలిపినప్పటి నుంచి నెలలో రెండు పర్యాయాలు మోటార్ల రిపేరుతో నీటి సరఫరాను నిలిపివేస్తారని అన్నారు. దీంతో పంప్‌హౌజ్ పరిధిలోని 12 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పంప్‌హౌజ్‌లో ఉన్న పంపులు, ఫిల్టర్ బెడ్స్, బావులు దాదాపు 30 సంవత్సరాల క్రితం నుంచి కొనసాగుతున్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టని కారణంగా మోటార్‌లు కాలిపోయాయన్నారు. మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మెగా కంపెనీ యాజమాన్యం సత్యసాయి పంప్‌హౌజ్‌కు రెండు కొత్త మోటార్‌లతో పాటు స్టాటర్‌లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక బడ్జెట్‌ను పంప్‌హౌజ్ నిర్వహణ కోసం కేటాయించాలన్నారు. రాస్తారోకో కారణంగా గద్వాల– ఆత్మకూర్‌తో పాటు మక్తల్ వైపు వెళ్తున్న వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు సంఘటన స్థలానికి వెళ్లి, సమస్యను అధికారులకు విన్నవించారు. తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని సంబంధిత ఏఈ, డీఈలు హామీ ఇచ్చారని చెప్పి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో నందిమళ్ల వార్డు మెంబర్‌లు మునెప్ప, వెంకటేష్, వెన్నెల సీపీఐ ప్రజాపంథా నందిమళ్ల గ్రామ కార్యదర్శి ఆశన్న, ఆంజనేయులు, రంగన్న, ఉస్మాన్, రాచల రంగారెడ్డి, రాజు, సునీత, సునంద ఉన్నారు.

ఎక్కడి పనులు అక్కడే..



'ఈ ఫొటోలో కన్పిస్తున్నది వనపర్తి జిల్లా పానగల్ మండలంలోని బహదూర్‌గూడెం గ్రామ పంచాయతీ భవనం. గ్రామ కార్యదర్శి రాకపోవడంతో పంచాయతీ కార్యాలయాన్ని తెరిచే నాథుడే లేకుండాపోయాడు. పది రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెతో చాలా వరకు గ్రామ పంచాయతీ భవనాలు ఇలా మూతబడి బోసిపోయి కన్పిస్తున్నాయి.'

పదిరోజులుగా సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- చాలాగ్రామాల్లో నిలిచిపోయిన పారిశుద్ధ్య పనులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక కొరవడిన పర్యవేక్షణ

సాక్షి, నాగర్‌కర్నూల్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టారు. గ్రామ కార్యదర్శులు పది రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరు కాక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలావరకు పల్లెల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని జిల్లా అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇన్‌చార్జ్ అధికారులు ఎవరూ గ్రామాల్లో కన్పించడం లేదు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో పాలన దాదాపుగా స్తంభించిన పరిస్థితి కనిపిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, హరితహారం మొక్కల సంరక్షణలో కార్యదర్శులు లేని లోటు ఎక్కువగా ఉంటోంది. మండల కార్యాలయాల్లోని సిబ్బందికి రెండు, మూడు గ్రామాల చొప్పున ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినా, వారంతా నిత్యం రెగ్యులర్ విధులతోనే సతమతమవుతున్నారు. ఇన్‌చార్జ్ అధికారులు ఎవరూ గ్రామాలకు హాజరుకాక ఎక్కడి సమస్యలు అ క్కడే ఉంటున్నాయి. అకాల వర్షాలకు డ్రైయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోగా చాలా గ్రామాల్లో పూడిక తీసేందుకు అధికారుల పర్యవేక్షణ కరువైంది.



పానగల్ మండలం బహుదూర్‌గూడెంలో కుళాయి వద్ద అపరిశుభ్రంగా పరిసరాలు

గ్రామాలకు వీరే 'కీ'లకం..

గ్రామాల్లో చాలావరకు పనులకు కార్యదర్శులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. వృద్ధుల చేతి వేలిముద్రలు రాక పెన్షన్ డబ్బులు తీసుకోవడానికి వీలుపడటం లేదు. ఇలాంటి సమయాల్లో కార్యదర్శులే డబ్బులు డ్రా చేసి లబ్ధిదారులకు అందిస్తున్నారు. మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు, నర్సరీలు, హరితహారం కింద మొక్కల సంరక్షణ, ఫీల్డ్ అసిస్టెంట్లు లేని చోట ఉపాధి హామీ పనుల నిర్వహణ, అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపులో గ్రామాల కార్యదర్శులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. రైతు బీమా కింద క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే మరణ ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉండగా.. కార్యదర్శులు లేకపోవడంతో పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గ్రామాల్లో చాలావరకు పనులు ఈజీఎస్ నిధులతోనే చేపడుతున్నారు. వీటి నిధులు వినియోగించుకునేందుకు కార్యదర్శులే సంతకం చేయాల్సి ఉండగా పనులన్నీ నిలిచిపోతున్నాయని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అమ్రాబాద్ మండల కేంద్రంలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

జిల్లా	గ్రా.పం.	జేపీఎస్‌లు
మహబూబ్‌నగర్	441	391
నాగర్‌కర్నూల్	461	293
వనపర్తి	255	183
జోగుళాంబగద్వాల	255	161
నారాయణపేట	280	178

గ్రా.పం: గ్రామపంచాయతీలు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. గ్రేడ్‌లో ఉన్న కార్యదర్శులకు, మండల కార్యాలయ సూపర్ వైజర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు గ్రామాల ఇన్‌చార్జీ బాధ్యతలు ఇచ్చాం. నేటి సాయంత్రంలోగా విధుల్లో చేరని జేపీఎస్‌లను తొలగించాలని ఆదేశాలున్నాయి.

– కృష్ణ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి, నాగర్‌కర్నూల్

ఇన్‌చార్జులు కనిపిస్తలేరు..



గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో సమస్యలు తీరడం లేదు. మరణ ధ్రువీకరణ పత్రాలు, వృద్ధుల పెన్షన్ పంపిణీ, పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. అధికారులు ఇన్‌చార్జ్‌లను నియమించారని చెబుతున్నారు. కానీ వారు గ్రామాల్లో కనిపించడం లేదు.

– అంజనేయులు, బహదూర్‌గూడెం, పానగల్ మండలం, వనపర్తి జిల్లా

కార్యదర్శులు లేక ఇబ్బందులు



పది రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో చాలావరకు పనులు కావడం లేదు. వృద్ధుల వేలిముద్రలు రాక కార్యదర్శుల ద్వారానే పెన్షన్ పంపిణీ జరిగేది. ఇప్పుడు పెన్షన్ డబ్బుల కోసం, పారిశుద్ధ్య నిర్వహణ, పర్యవేక్షణ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– నారాయణ, సర్పంచ్, ఓబులాపూర్, నారాయణపేట జిల్లా

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


శ్యామమ్మ(ఫైల్)

కోస్గి: చివరి శ్వాస వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓ వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. పట్టణంలోని మున్నూర్ వీధికి చెందిన కూర శ్యామమ్మ(110) తన వంశంలో నాలుగు తరాల వారిని చూసింది. చివరి రోజుల వరకు ఆరోగ్యంగానే ఉండింది. కొన్ని రోజులుగా స్వల్ప అనారోగ్యానికి గురై సోమవారం సాయంత్రం తన ఇంట్లో తుది శ్వాస విడిచింది. వయస్సు పైబడిన ముసలి వారి నుంచి చిన్న పిల్లల వరకు శ్యామవ్వగా పిలిచేదీమె మృతి చెందడంతో పెద్ద ఎత్తున కాలనీ వాసులు ఆమెను చూసేందుకు వచ్చారు.

టిప్పర్ కింద పడి వ్యక్తి..

కొల్లాపూర్ రూరల్: టిప్పర్ రివర్స్ తీస్తుండగా గమనించకపోవడంతో ద్విచక్రవాహనంపై ఎక్కడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సున్నపుతండా సమీపంలో ఉన్న పీఎస్‌కే కంపెనీ డీపీఎంగా కృష్ణారెడ్డి (40) విధులు నిర్వహిస్తున్నాడు. కంపెనీ వద్ద ఓట టిప్పర్‌కు మరమ్మతు చేస్తుండగా, పూర్తయిన తర్వాత దాన్ని స్టార్ట్ చేసి రివర్స్‌లో తీశారు. వెనుక నుంచి ఫోన్‌లో మాట్లాడుకుంటూ కృష్ణారెడ్డి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆయన తేరుకునేలోపే ద్విచక్రవాహనంపైకి టిప్పర్ ఎక్కింది. కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తిగా తెలిసింది.

ఆటో, బైక్ ఢీకొని ఒకరు..

కల్వకుర్తిరూరల్: ఆటో, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ సమీపంలోని దేవరకొండ, కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఉన్న అక్షరవనం సమీపంలో ద్విచక్రవాహనం ఆటో ఢీకొన్న సంఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కృష్ణయ్య(42) మృతి చెందాడు. వంగూరు మండలానికి చెందిన కృష్ణయ్య పట్టణానికి పని నిమిత్తం వచ్చాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో తిరిగి వంగూరుకు వెళ్తుండగా పట్టణ సమీంలో అక్షరవనం వద్ద ఆటో అడ్డురావడంతో ఢీకొని తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గన్యాగుల శివారులో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లకు చెందిన పెద్దరాములు (60) ఈనెల 4న చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కాగా మండలంలోని గన్యాగుల శివారులోని బావిలో పెద్దరాములు మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

రాజోళి: మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన అలపాటి నాగరాజు(35) సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. పనులకు వెళ్లకుండా మద్యం తాగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, సోమవారం తిరిగి వచ్చాడు. రోజంతా ఎక్కడికి వెళ్లావని భార్య శాంతిప్రియ ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న ఆయన తన వెంట తెచ్చుకున్న పురుగు మందు డబ్బాను చూపించి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీ తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కర్నూల్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జడ్చర్లలో యువకుడు..

జడ్చర్ల: పట్టణంలోని నిమ్మబావిగడ్డకు చెందిన ఆర్.గణేష్(30) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. భార్యాభర్తల గొడవ వల్ల మనస్తాపంతో ఈనెల 5న రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లి రత్నావత్ శాంతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగింత

ఊట్కూరు: గుర్తు తెలియని మృతదేహం వివరాలు లభ్యమైనట్లు సోమవారం ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మోట్కార్ శేఖర్‌రెడ్డి(40) మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఆయనకు ఏడాది కాలంగా తరచుగా మూర్ఛ వస్తుండేది. బహిర్భూమికి వెళ్లి మూర్ఛ రావడంతో మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద గుంతలోపడ్డాడు. ఆదివారం స్థానికులు గుర్తించడంతో మృతదేహాన్ని వెలికితీసి నారాయణపేట ఆస్పత్రిలో భద్రపరిచారు. సోమవారం కుటుంబసభ్యులు వచ్చి మృతుని గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య రాజమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

నిండు ప్రాణాలకు.. నీటి గండం


చిన్నంబావి మండలం అమ్మాయిపల్లి శివారులోని బావిలో ఈత కొడుతున్న బాలలు

కన్నవారికి కడుపు కోత మిగుల్చుతున్న ప్రమాదాలు

- అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం
- పెద్దవారి సమక్షంలోనే వెళ్లడం ఉత్తమం

మహబూబ్‌నగర్ క్రైం: ప్రస్తుతం వేసవి సెలవుల్లో పిల్లలు ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. అలాంటిది జిల్లాలో ఈతరాక ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. ఈ మధ్యకాలంలో స్విమ్మింగ్ పూల్స్‌లో సైతం ప్రమాదవశాతు మృతి చెందుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భౌగోళికంగా చూస్తే వాగులు, వంకలు, నదులు, కాల్వలకు కొదువ లేదు. దీంతో ఈ మధ్య ప్రాజెక్టుల కోసం, మిషన్ భగీరథ, మైనింగ్ గుంతలలో నిలిచిన నీటిలో ఈత పడటానికి వెళ్తున్నారు. దీంతో ప్రమాదవశాత్తు వాటిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల నారాయణపేట జిల్లా బోయినపల్లి చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు నీటిలో మునిగిపోతుండగా.. వారిని కాపాడేందుకు వెళ్లిన ఓ మహిళ కూడా నీటి మునిగి.. నలుగురూ మృత్యువాతపడ్డారు. అలాగే వనపర్తి జిల్లాలో జూరాల కాల్వలో పడి ఇద్దరు తోడల్లుళ్లు మృతిచెందారు.. ఈ ఘటనలు మరువక ముందే సోమవారం ఈతకు వెళ్లి వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఏడుగురు మృతి చెందారు.

పెరుగుతున్న ప్రమాదాలు

మండు వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి.. సెలవుల సరదాతో కాలక్షేపం కోసం ఈతకు వెళ్లడం అందరికీ అభిరుచిగా మారుతోంది. జిల్లా కేంద్రంతోపాటు ఇతర పట్టణాల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో ఈత సరదా తీర్చుకునేందుకు అనువుగా స్విమ్మింగ్‌పూల్స్ వెలసినా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువకులు, చిన్నారులు ఆయా ప్రాంతాల్లో ఉండే బావులు, కుంటలు, చెరువులు, కాల్వలను ఆశ్రయిస్తున్నారు. చాలామందికి ఈత కొట్టడం ఎలాగో తెలియక ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. రక్షణ చర్యల్లేక ఈత మాటున నిండు ప్రాణాలను పోగొట్టుకుని కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. వేసవిలో బాలలు, యువకులు జిల్లాలో ఈతకు వెళ్తూ నీటిలో మునిగి మృత్యువాత పడుతున్న సంఘటనలు ఏటా పెరుగుతున్నాయి.

ప్రథమ చికిత్స ముఖ్యం..

నీటిలో ప్రమాదానికి గురైన వ్యక్తిని ఒడ్డుకు చేర్చగానే అతన్ని వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే నోట్లో నోరు పెట్టి శ్వాస అందించాలి. ఛాతిపై చేతులతో ఒత్తితే శ్వాస పెరుగుతుంది. ప్రథమ చికిత్స చేస్తూనే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించాలి.

జాగ్రత్తలు అవసరం..

ఈత నేర్చుకునేందుకు వెళ్తున్నప్పుడు అక్కడ సుశిక్షితులైన కోచ్‌లు, ఇతర సిబ్బంది, రక్షణ చర్యలు ఉన్నాయో పెద్దలు పరిశీలించాల్సిన తర్వాతే పిల్లలను పంపించాలి.

- చెరువులు, కాల్వలు, ఈతకు వెళ్తున్నప్పుడు బాలల వెంట పెద్దవారు తప్పక వెళ్లాలి.
- కొత్త ప్రదేశంలో బావులు, కాల్వలు, చెరువుల్లో ఈత కొట్టే ముందు కర్ర సాయంతో లోతును పరిశీలించాలి. ఈత రాని వారు దాన్ని నేర్చుకునేందుకు ట్యూబ్‌లు, ఇతర పరికరాలను ఉపయోగించి పూర్తిగా ఈత కొట్టడం వచ్చాకే లోతుకు వెళ్లాలి.
- సెలవులు కాబట్టి పిల్లలు బయటికి వెళ్లి చాలా సమయమైతే వారి తల్లిదండ్రులు పిల్లల సమాచారంపై వాకబు చేసుకొని చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది.
- విహార, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు స్నానం ఆచరించాలే తప్ప అక్కడి వాటిలోకి వెళ్లి ఈత కొట్టడం చేయవద్దు.
- మట్టిని లోతుగా తవ్విన ప్రాంతాల్లో నిలిచిన నీటిలో లోతు తెలియదు. కాబట్టి ఇలాంటి వాటిలో ఈతకు సాహసం చేయరాదు.
- జిల్లాలో కృష్ణ, జూరాల, కోయిల్‌సాగర్, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ చాలా జాగ్రత్తగా ఉండాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో సెలవులు గడపటానికి వచ్చిన పిల్లలు ఈతకు వెళ్లినప్పుడు వారి వెంట పెద్దవారు తప్పకుండా వెళ్లాలి.

బోర్డులు ఏర్పాటు చేశాం..

ప్రతిరోజు సెట్ కాన్ఫరెన్స్‌లో పోలీస్ సిబ్బందికి ఈత ప్రమాదాలపై సూచనలు ఇస్తున్నాం. సర్పంచ్‌ల ద్వారా గ్రామాల్లో టాంటాం వేయించి చెప్పిస్తున్నాం. తల్లిదండ్రులు వారి పిల్లలను జలాశయాలు, చెరువులు, కాల్వలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లావ్యాప్తంగా జలాశయాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం.

– కె.నరసింహ, ఎస్పీ, మహబూబ్‌నగర్

రక్షించడం ఇలా..

ప్రత్యక్ష పద్ధతి ద్వారా నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే వీలుంటుంది. అయితే రక్షించబోయే వ్యక్తికి ఈత రావడంతోపాటు ధైర్యం కలిగి ఉండాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తి వెనక నుంచి వెళ్లి అతని వెంట్రుకలు, అండర్‌వేర్, మొలతాడు వంటి వాటిలో ఏదో ఒకటి పట్టుకొని ఒడ్డుకు తీసుకురావాలి.

పరోక్ష పద్ధతిలో..

ఈ పద్ధతి ద్వారా ఈత వచ్చిన వారితోపాటు రాని వారు కూడా నీటిలో మునుగుతున్న వారిని రక్షించవచ్చు. రక్షించేవారు నీటిలోకి దిగకుండా ఒడ్డున ఉండే ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆసరాగా ఒడ్డు నుంచే ఏదైనా పట్టుకునేలా అందించాలి. దగ్గరగా ఉంటే కర్ర, టవల్, ప్యాంట్ వంటివి అందించాలి. దూరంగా ఉంటే తాడు, పొడవాటి కర్రను అందించి ఒడ్డుకు చేర్చాలి. నీటిపై తేలియాడే పరికరాలను నీటిలోకి విసరాలి.

అర్ధరాత్రి మొరాయించిన ట్రావెల్ బస్సు


జాతీయ రహదారిపై నిలిచిపోయిన ట్రావెల్ బస్సు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ప్రయాణికులు

- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల: పట్టణ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు సాంకేతిక సమస్యలు ఆదివారం అర్ధరాత్రి నిలిచిపోయింది. ప్రయాణకులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు జీపీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అర్ధరాత్రి 12 గంటలకు బయలుదేరింది. బెంగుళూరుకు వెళ్లేందుకు 30 మంది ప్రయాణికులను బస్సులో ఎక్కించుకుంది. రాత్రి 1గంట తర్వాత పట్టణానికి దాదాపు 5కి.మీల దూరంగా బస్సు నిలిచిపోయింది. ఇంజన్‌లో సాంకేతిక సమస్యలతో పాటు లైట్లు రాలేదు. డ్రైవర్ సులేమాన్ కొద్ది సేపట్లో సాంకేతిక సమస్యను సరి చేసి బయలుదేరుతామని చెప్పడంతో ప్రయాణికులు సర్దుకున్నారు. సకాలంలో బస్సు మరమ్మతు కాకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. విషయాన్ని ట్రావెల్స్ యాజమన్యానికి చెప్పేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో జాతీయరహదారిపై రాత్రంతా జాగరణ చేయాల్సి వచ్చింది. దీంతో 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో స్థానిక సీఐ రమేష్‌బాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తెల్లవారిన తర్వాత కొందరు ప్రయాణికులు 14 మంది వెళ్లారు. మిగతా వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చివరకు ఉదయం 10 గంటలకు స్థానిక మెకానిక్ సాయంతో కొత్తగా విడిభాగాలను సమకూర్చి మరమ్మతు చేయడంతో బస్సు స్టార్ట్ అయ్యింది. విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని డ్రైవర్ సులేమాన్ స్థానిక విలేకరులకు వివరించారు. ప్రయాణికుల అసౌకర్యానికి చింతిస్తూ తగు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు డ్రైవర్ తెలిపాడు. ట్రావెల్స్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తాము సకాలంలో బెంగుళూరుకు చేరకపోవడమే గాక మానసికంగా తీవ్ర ఆందోళనకు గురయ్యామని, కొంత మందికి వాంతులు, విరేచనాలతో ఆరోగ్య సమస్యలకు గురికావాల్సి వచ్చిందని తెలిపారు. ఫిర్యాదు స్వీకరించినట్లు రశీదు ఇవ్వడంతో ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రయాణికులు బెంగుళూరుకు బస్సులో బయలుదేరి వెళ్లారు.

భయపడ్డాం

అసలే జాతీయరహదారి, అర్ధరాత్రి కావడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యాం. రహదారిపై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితి ఉండడంతో పక్కకు కదలలేక ఇబ్బందులు పడ్డాం. కనీసం తాగేందుకు నీళ్లు, తినడానికి ఎలాంటివి దొరకని పరిస్థితి ఉంది.

– భవ్య, హైదరాబాద్

ఇబ్బందులు పడ్డాం

బస్సు బ్రేక్‌డౌన్ కావడంతో ఇబ్బందులు పడ్డాం. నిర్ణీత సమయానికి బెంగుళూరు చేరుకోలేకపోవడంతో విధులకు హాజరు కాలేకపోయాం. దీంతో తమ యాజమాన్యాలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– వివేకానంద, ఉద్యోగి, హైదరాబాద్

దుర్భర పరిస్థితి..



అర్ధరాత్రి జాతీయ రహదారిపై బస్సు బ్రేక్ డౌన్ కావడంతో చాలామంది అరోగ్యపరంగా ఇబ్బందులు పడ్డారు. అందుబాటులో వాష్‌రూమ్స్ లేకపోవడం, కనీస అవసరాలను తీర్చుకోలేని దుర్భర పరిస్థితిలో 100కు డయల్ చేశాం.

– సుధాకర్, హైదరాబాద్

తల్లిదండ్రులకు చేదోడుగా వచ్చి.. పిడుగుపాటుతో యువకుడి మృతి

- ప్రాణాలతో బయటపడిన తల్లి

పగిద్యాల(నంద్యాల): జీవాలను మేపుకుంటూ వలస వచ్చిన తల్లిదండ్రులకు చేదోడుగా వచ్చిన ఓ యువకుడు పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా పగిద్యాల – కొణిదేల రహదారి మధ్య పొలాల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూముకుంట బొల్లవరం గ్రామానికి చెందిన కురువ ఆవుల నాగేంద్ర, అతని భార్య లక్ష్మీ దాదాపు పది నెలల క్రితం జీవాలు మేపుకోవడానికి పగిద్యాల మండలానికి వలస వచ్చారు. ఇటీవల ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో వారి కుమారుడు ఆవుల విష్ణు(18) కూడా వారి వద్దకు చేరుకున్నాడు. ప్రతి రోజు జీవాలను మేపుకుని ఒప్పందం ఉన్నా పొలాల్లో మందలను రాత్రి నిలిపేవారు. ఈ క్రమంలో కొణిదేల గ్రామానికి ఓ రైతు పొలంలో మందను నిలిపారు. తుఫాన్ ప్రభావంతో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో పొలంలో ఉండే వేప చెట్టు కిందకు విష్ణు పరుగెత్తాడు. ఇంతలోనే చెట్టుపై పిడుగు పడడంతో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ ప్రమాదంలో మృతుని వద్ద ఉండే ఆండ్రాయిడ్ సెల్ ధ్వంసమై గుండె ఉండే ప్రాంతంలో గాయాలై యువకుడి హఠాన్మరణం చెందినట్లు తెలుస్తోంది. చెట్టుకు కొద్ది దూరంలో ఉన్న మృతుని తల్లి లక్ష్మి ప్రాణాలతో బయటపడింది. సమాచారం అందుకున్న ముచ్చుమర్రి స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వీఆర్వో నాగన్న పంచనామా రిపోర్ట్ ఆధారంగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికి వచ్చిన కుమారుడు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


యువకుడు ఆవుల విష్ణు మృతదేహం

హకీంపేటలో ఉద్రిక్త వాతావరణం

కోస్గి: బొడ్రాయి ప్రతిష్ఠాపన విషయంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం గ్రామంలో తీవ్ర ఉద్రిక్తలకు దారి తీసింది. చివరకు పోలీసు ప్రత్యేక బలగాలు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశాయి. వివరాల్లోకి వెళితే.. పూర్వ కోస్గి మండలంలోని హకీంపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకను నిర్వహించే క్రమంలో ఆదివారం రాత్రి రెండు వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. బొడ్రాయిని ఎస్సీ కాలనీలో స్థాపించేందుకు ఏర్పాటు చేయగా మరో వర్గం వారు వ్యతిరేకించారు. స్థలాన్ని మార్చాలని పట్టుబట్టడంతో గొడవ పెరిగింది. ఈ క్రమంలో ఓ వర్గం మహిళలు బోనాలతో రావడంతో మరో వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో తోపులాటలతో పరిస్థితి విషమించి దాడులు చేసుకున్నారు. సీఐ జనార్దన్, ఎస్‌ఐ శ్రీనివాసులు జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక బలగాలను రప్పించి పరిస్థితి అదుపు చేశారు. గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సంఘటనలో 16 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

బిజినేపల్లి: మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు వేర్వేరు దొంగతనాల కేసులో జిల్లా కోర్టులో సోమవారం జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. 2014లో మండలంలోని లింగసానిపల్లికి చెందిన సర్వోజీ వినోద్ అదే గ్రామంలో ఓ ఇంట్లో ఆభరణాలు దొంగిలించినట్లు నేర నిరూపణ కావడంతో అతనికి 6 నెలల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. జనవరిలో మంగనూర్‌లో ద్విచక్ర వాహనాన్ని బిజినేపల్లికి చెందిన శివకృష్ణ దొంగిలించినట్లు నిరూపణ కావడంతో అతనికి ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మానిక సోమవారం తుది తీర్పు వెల్లడించారు.

యువతి అదృశ్యం

కోస్గి: యువతి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. మండలంలోని ముంగిమళ్లకు చెందిన ఓ యువతి(22) డిగ్రీ పూర్తి చేసి పట్టణంలో టైలరింగ్ నేర్చుకుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 5న ఎప్పటిలాగే గ్రామం నుంచి టైలరింగ్ కోసం పట్టణానికి వచ్చిన యువతి తిరిగి ఇంటికి వెళ్లలేదు. తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తికి తీవ్రగాయాలు

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్ పంచాయతీ పరిధిలోని ఇసుకబాయితండాకు చెందిన దేవుజనాయక్ (57) హైదరాబాద్‌లో తాపి మేస్త్రీ పని చేస్తూ ఉండేవాడు. సోమవారం సొంత గ్రామానికి వచ్చేందుకు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో కాలుజారి పడిపోయాడు. దీంతో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. అయన్ను రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించినట్లు సర్పంచ్ మొగులయ్య తెలిపారు.

కోనసీమను తలపిస్తున్న పాలమూరు


దేవరకద్ర ఆర్వోబీపై నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ర్యాలీ

- సాగునీటి వనరులతో వలస జిల్లాకే వలసలు
- ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- దేవరకద్రలో ఆర్వోబీ, అభివృద్ధి పనుల ప్రారంభం

దేవరకద్ర: ఒకప్పుడు వలస జిల్లాగా పేరున్న పాలమూరు.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు ఉపాధి కోసం వలస వచ్చే జిల్లాగా మారింది.. ఎటు చూసినా పచ్చని పంటలతో కోనసీమను తలపిస్తుందని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి దేవరకద్రలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, ఆర్వోబీపై వాహనాల రాకపోకలను జెండా ఊపి ప్రారంభించారు. ఆర్వోబీపై నుంచి బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించిన భారీ ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లా అంటే కేసీఆర్‌కు వల్లమాలిన అభిమానం అన్నారు. హైదరాబాద్‌లో కొత్త సచివాలయం ప్రారంభించిన వెంటనే మొదటి సమావేశం పాలమూరు– రంగారెడ్డిపైనే నిర్వహించారని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని తరలించి ఏడాది పొడవునా నిండుగా ఉండేలా చేయవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడంతో సాగునీటి వనరులు పెరిగాయన్నారు. గతంలో నేను బిల్డర్‌గా ఉన్నప్పుడు ఎక్కడ బిల్డింగ్ కట్టిన 90 శాతం కూలీలు పాలమూరు వారే పనిచేశారని గుర్తుచేశారు. ఇప్పుడు పక్క రాష్ట్రాల నుంచి కూలీలు వలస వచ్చే విధంగా పాలమూరు మారిపోయిందని చెప్పారు.


క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే ఆలను సీటులో కూర్చోబెడుతున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

ఆలపై పొగడ్తల వర్షం

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. నియోజకవర్గంలో చేసిన సర్వేలో పార్టీకి 60 శాతంపైగా ప్రజల మద్దతు ఉందన్నారు. కష్టపడేతత్వం ఆలకు ఉందని, సీఎం కేసీఆర్‌కు కూడా ఆయన అంటే అభిమానం అన్నారు. దేవరకద్రకు ఆర్‌అండ్‌బీ ద్వారా వచ్చిన నిధులు సీఎం మంజూరు చేసినవే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవరకద్రలో రూ.కోటితో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రులు ప్రారంభించారు. నూతన భవనంలో పూజలు జరిపించి.. ఎమ్మెల్యే చాంబర్‌లోని కుర్చీలో ఎమ్మెల్యే ఆలను కూర్చోబెట్టి శాలువాతో సత్కరించి అభినందించారు.

ఆగం చేయాలని చూస్తున్నారు..

తెలంగాణను ఆగం చేయాలని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని, వారి ఆలోచనలను తిప్పు కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మా పాలనే వస్తుందని ఎవరికి వారు గొప్పలు చెప్పుకొంటున్నారని, ప్రజలు, కులాల మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నిస్తున్నారని, వారి పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. పాలమూరును సస్యశ్యామలం చేయడం వారికి నచ్చడం లేదని, అందుకే కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

జీవనదిగా మారుస్తాం..

దేవరకద్ర నియోజకవర్గంలోని వాగులను జీవనదులుగా మారుస్తామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే రెండు వాగులపై దాదాపు రూ.130 కోట్లతో 21 చెక్‌డ్యాంలను నిర్మించామని, మరో 9 చెక్‌డ్యాంలకు రూ.77 కోట్లు మంజూరయ్యాయన్నారు. కర్వెన ప్రాజెక్టు పూర్తయితే కోయిల్‌సాగర్‌ను ఏడాది పొడవునా నీరు ఉండే రిజర్వాయర్‌గా మారుస్తామని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు రమాదేవి, అన్నపూర్ణ, హర్షవర్ధన్‌రెడ్డి, విజయ, వామన్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, శివానంద్ పాల్గొన్నారు.

కేంద్రం సహకరించకున్నా..

ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం సహకరించకున్నా.. పక్క రాష్ట్రం పేచీ పెడుతున్నా.. కృష్ణాజలాల వాటా తేల్చకపోయినా 'పాలమూరు– రంగారెడ్డి'ని పూర్తి చేయాలని ధృడసంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ కంకణ బద్ధుడై పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజలను మోసం చేసే పనిలో కాంగ్రెస్, బీజేపీలు ఉన్నాయని, అవినీతిమయమైన ఆ పార్టీలను నమ్మవద్దని మంత్రి కోరారు. బీజేపీ ప్రభుత్వం అసమర్థ పాలన వల్ల డాలర్ విలువ పెరిగిందన్నారు. మోదీ రాక ముందు డాలర్ విలువ రూ.50 ఉండగా.. ఇప్పుడు రూ.83కు, డీజిల్ రూ.100, పెట్రోల్ రూ.110కి పెరిగాయని విమర్శించారు. ప్రజలు నిత్యావసర ధరల పెరుగుదలతో సతమతమవుతుంటే బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచిపెడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ పరిస్థితి మరీ ఘోరంగా తయారైందని, పార్టీ అధ్యక్షుడిని ఎంపీగా తొలగించినా ఏమీ చేయని దుస్థితికి చేరిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తనను తానే గొప్ప వ్యక్తి అనుకుంటున్నాడని, బూర్గుల రామకృష్ణారావు, జైపాల్‌రెడ్డితో పోల్చుకుంటున్నాడని అయితే వారి కాలి గోటికి కూడా సరిపోడని ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

'జగనన్నకు చెబుదాం' @1902

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్


సాక్షి, అమరావతి: సంతృప్త స్థాయిలో వినతుల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్దేశిత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలందించడమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టనున్నారు. క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం కోసం ప్రత్యేకంగా 1902 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి వినతి పరిష్కారమయ్యే వరకూ ట్రాకింగ్ చేస్తారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి సమస్యలున్నా తెలియచేయవచ్చు. సంక్షేమ పథకాలు, వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు పొందడంలో ఏమైనా అవాంతరాలు ఎదురైతే రైతన్నలు, అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, మరెవరైనా సరే ఫిర్యాదు చేయవచ్చు. రెవెన్యూ రికార్డులకు సంబంధించి ఏమైనా సమస్యలున్నా, ప్రభుత్వ సేవలకు సంబంధించి మరే ఇతర ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా పరిష్కారం కోసం 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ద్వారా పౌరులు ఎప్పటికప్పుడు తమ ఫిర్యాదుల స్థితి, పరిష్కారం గురించి తెలుసుకునే వీలుంది. ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో పాటు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తుంది.

ప్రజా సమస్యలపై పోరుకు సిద్ధంకండి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఇంటింటికీ సీపీఐ'పాదయాత్రలో తమ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను క్రోడీకరించి, వాటి పరిష్కారానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, సాక్షాత్తూ ప్రధాని మోదీ 'జై బజరంగ్‌దళ్ అంటూ ఓట్లు వేయాలని మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సర్దుబాటు అంశాన్ని పక్కన పెట్టి, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను అధ్యయనం చేయాలని, వాటి పరిష్కారానికి పోరాడాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతిక కారణాలను చూపుతూ సీపీఐ జాతీయ హోదాను ఉపసంహరించడంపై మండిపడ్డారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,054 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, రాత్రి 7గంటల వరకు 5.928 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 110 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 808 అడుగులు

దోమలపెంట: నీటి క్యాచ్‌మెంట్ వలన 24గంటల వ్యవధిలో శ్రీశైలం జలాశయంలో మూడు పాయింట్ల నీటిమట్టం పెరిగింది. ఫలితంగా సోమవారం జలాశయంలో 808 అడుగుల నీటిమట్టం, 33.1 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల కాలేదు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీగా ఆర్టీసీ ఆస్పత్రి

నేటి నుంచి సేవలు, 'నిమ్స్' ఫీజుల వర్తింపు

- కొత్తగా 16 బెడ్ల ఐసీయూ, నాలుగు ఆపరేషన్ థియేటర్లు
- త్వరలో సర్జికల్ ఐసీయూ అందుబాటులోకి
- ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా సాధారణ రోగులకూ వైద్య సేవలు



సాక్షి, హైదరాబాద్: ఇంతకాలం సంస్థ ఉద్యోగులకే పరిమితమైన తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి సాధారణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అవతరించింది. ఇటీవలే సాధారణ ప్రజల(ఆర్టీసీ ఉద్యోగులు కానివారు)కు ఔట్ పేషెంట్లుగా చికిత్స ప్రారంభించిన ఆర్టీసీ.. ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ సేవలతో ముందుకొచ్చింది. ఇందుకోసం 16 పడకలతో కూడిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను సిద్ధం చేసింది. నాలుగు ఆపరేషన్ థియేటర్లను కూడా కొత్తగా ఏర్పాటు చేసుకుంది. వీటిని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు.

ఏడు ఆపరేషన్ థియేటర్లు..

గతంలో అత్యవసర వైద్య సేవలు అందించే పరిస్థితి లేకపోవటంతో ఇక్కడికి వచ్చే రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేసేవారు. ఆ స్థితి నుంచి క్రమంగా కీలక చికిత్సలు, అత్యవసర ఆపరేషన్లు చేసే స్థాయికి తార్నాక ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం మూడు ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయి. కొత్తగా మరో నాలుగు ఆపరేషన్ థియేటర్లను సిద్ధం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ భవనంపై కొత్తగా ఐసీయూ బ్లాక్‌ను నిర్మించారు. ఇందులో 16 బెడ్లు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులే కాకుండా సాధారణ ప్రజలకూ ఇందులో చికిత్స అందిస్తారు. నిమ్స్ తరహాలో తక్కువ చార్జీలు వసూలు చేయనున్నారు. రోజుకు రూ.3 వేలు, అంతకంటే తక్కువే వసూలు చేయనున్నట్టు సమాచారం.

త్వరలో సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్..

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆధునిక వసతులతో ఉండే సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కూడా ఆర్టీసీ ఆసుపత్రిలో సిద్ధం చేశారు. త్వరలో దీన్ని వినియోగంలోకి తేనున్నారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ ప్రారంభించిన తర్వాత, ఎస్ఐసీయూ బ్లాక్‌లో ఫ్యూమిగేషన్ చేసి, బ్యాక్టీరియా కల్చర్ పరీక్షలు నిర్వహించి నెగెటివ్ రిపోర్టు వస్తే వెంటనే దాన్ని అందుబాటులోకి తెస్తారని సమాచారం. సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందిన వారు, కీలక ఆపరేషన్లు చేయించుకున్న రోగులు.. కొంతకాలం ఐసీయూలో ఉండాల్సి వస్తే ఇందులో ఉంచుతారు. వార్డులో ఓవైపు దీన్ని కొత్తగా ఏర్పాటు చేశారు.

ఇక ప్రతి డిపోలో హెల్త్ వాలంటీర్లు..

ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారి హెల్త్ హిస్టరీతో కూడిన రికార్డులను సిద్ధం చేశారు. గుండె సమస్యలు, ఇతర తీవ్ర ఆరోగ్య ఇబ్బందులతో బాధపడుతున్నట్లు గుర్తించిన ఉద్యోగులకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తూ, వారు క్రమపద్ధతిలో మందులు వాడేలా చూస్తున్నారు. గుండె సంబంధిత సమస్యలున్నాయని తేలిన 278 మంది ఉద్యోగుల్లో ఇద్దరు మందుల వాడకంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొద్ది రోజుల్లోనే వారు మృతి చెందారు. ఇలాంటి పరిస్థితి మిగతావారికి రావద్దనే ఉద్దేశంతో ప్రతి డిపోలో సుశిక్షితులైన ఇద్దరు హెల్త్ వర్కర్లను నియమించాలని ఆర్టీసీ నిర్ణయించింది. వీరు ఉద్యోగులకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించడంతో పాటు వారి హెల్త్ హిస్టరీ ఆధారంగా మందులు వాడేలా చూస్తారు.

అలాగే వీరి వద్ద డిజిటల్ బీపీ చెకింగ్ యంత్రాలుంటాయి. వాటి ద్వారా బీపీని మానిటర్ చేస్తుంటారు. ఉద్యోగులకు సీపీఆర్‌పై శిక్షణ ఇస్తారు. ఇప్పుడు ఈ హెల్త్ వర్కర్లకు శిక్షణ ప్రారంభించనున్నారు.

కేసీఆర్‌కు వారమే గడువు..

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయకపోతే అడ్డుకుంటాం: బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: ''సీఎం కేసీఆర్‌కు వారం గడువిస్తున్నాం. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్‌ల)ను రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. లేనిపక్షంలో వారితో కలిసి సీఎం సహా మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా ఉద్యమాన్ని కొనసాగిస్తాం...అవసరమైతే న్యాయపరమైన చర్యలకూ వెనుకాడబోం'అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ హెచ్చరించారు. 'జేపీఎస్‌లు భయపడొద్దు... ఉద్యోగాల నుంచి తొలగిస్తే ఇంట్లోనే ఉండండి. కార్యదర్శుల పక్షాన బీజేపీ ఉద్యమిస్తుంది. కేసీఆర్ ప్రభుత్వం కొనసాగేది మరో 5 నెలలే. ఆ తరువాత బీజేపీ అధికారంలోకి వస్తుంది. తొలగించిన ఉద్యోగులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటాం'అని ఆయన భరోసానిచ్చారు. ఈ మేరకు బండి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 11 రోజులుగా సమ్మె చేస్తున్న జేపీఎస్‌లను ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడాన్ని ఖండించారు. 'జేపీఎస్‌లు చేసిన తప్పేంది? నాలుగేళ్లపాటు ప్రొబేషనరీ పీరియడ్‌ను పూర్తి చేశారు. అయినప్పటికీ నేటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయం. వీళ్లంటే కేసీఆర్ కు ఎందుకంత కక్ష? కేసీఆర్ కుటుంబానికి లంచాలు ఇవ్వలేదేమో.. పైసలిస్తే ఈపాటికే రెగ్యులరైజ్ చేసేవాళ్లేమోననే అనుమానం కలుగుతోంది'అని పేర్కొన్నారు. 'కేసీఆర్ అహంకారంవల్ల ఇప్పటికే వీఆర్వో వ్యవస్థ సర్వనాశనమైంది. 23 వేల మంది ఆర్టిజన్లు సమ్మె చేసి దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. 22వేల మంది స్కావెంజర్ల జీవితాలను రోడ్డున పడేశారు'అని ఆ ప్రకటనలో ధ్వజమెత్తారు.

విధుల్లో చేరకుంటే వేటే!

▶ మొదటి పేజీ తరువాయి

సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం నోటీసు జారీ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడం అంటూ ఉండదని, ప్రభుత్వం నియమించిన కమిటీ.. సంతృప్తికరమైన పనితీరు, నైపుణ్యాలు ఉన్నాయని గుర్తించిన వారిని మాత్రమే క్రమబద్ధీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జేపీఎస్‌లు సంఘంగా ఏర్పడటమే కాకుండా, చట్ట విరుద్ధంగా గత నెల 28 నుంచి సమ్మెకు దిగారని, ఈ కారణంగా సర్వీసులో కొనసాగే హక్కును జేపీఎస్‌లు కోల్పోయారని పేర్కొన్నారు. అయినప్పటికీ ఓ చివరి అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని, మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధుల్లో చేరాలని ఆదేశిస్తున్నామని తెలిపారు.

సమ్మె కొనసాగింపునకే మొగ్గు..

సమ్మెను కొనసాగించాలా వద్దా? అన్న దానిపై అన్ని జిల్లాల కమిటీలతో సంఘం నేతలు సోమవారం రాత్రి పొద్దుపోయే దాకా గూగుల్ మీట్‌లో చర్చించారు. ఈ సందర్భంగా తమను సర్వీసుల నుంచి టర్మినేట్ చేసినా సమ్మె కొనసాగించేందుకే మొగ్గు చూపుతున్నట్టు పలువురు జేపీఎస్‌లు తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం నుంచి కచ్చితమైన తేదీతో కూడిన హామీ లభిస్తేనే సమ్మె విరమిస్తామని జేపీఎస్‌ల సంఘం ప్రకటించింది. అన్ని జిల్లాల అధ్యక్షులు సమ్మె కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా మంగళవారం ఎవరికైనా టెర్మినేషన్ నోటీసు వస్తే తీసుకోకూడదని సమావేశంలో తీర్మానించారు. గత ఒప్పందం మేరకు పలువురు జేపీఎస్‌లు విధుల్లో చేరే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలకుగాను దాదాపు మూడు వేలమంది పర్మనెంట్ ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శులు మినహాయించి దాదాపు 9,350 మంది జేపీఎస్‌లు (ఔట్‌సోర్సింగ్ వెయ్యి మందితో కలిపి) సమ్మెలో ఉన్నారు.

'టీఎస్‌పీఎస్సీ లీకేజ్' కేసులో మరో ఇద్దరు అరెస్టు

- ప్రవీణ్ నుంచి ఏఈఈ, ఏఈ పేపర్లు తీసుకున్న ద్వయం
- ఏడుగురు అభ్యర్థులకు రూ.10 లక్షల చొప్పున విక్రయం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ లీకేజ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రవీణ్ కుమార్ నుంచి ఏఈఈ, ఏఈ పరీక్ష పత్రాలను తీసుకుని పలువురికి విక్రయించిన ఇద్దరు దళారులు వరంగల్‌కు చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి, హైదరాబాద్ వాసి మురళీధర్‌రెడ్డిలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రవీణ్ స్నేహితులైన వీరిద్దరూ పరీక్ష పత్రాలను హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురిని విక్రయించారు. ఒక్కో పేపర్ రూ.10 లక్షల చొప్పున అమ్మి కొందరి నుంచి మొత్తం, మరి కొందరి నుంచి అడ్వాన్సులు తీసుకుని మొత్తంగా నగదురూపంలోనే ప్రవీణ్‌కు అప్పజెప్పారు. ఈ కారణంగానే ప్రవీణ్ బ్యాంకు ఖాతాలో ఈ నగదుకు సంబంధించిన లావాదేవీలు కనిపించలేదు. అయితే అనుమానం వచ్చిన సిట్ ఫోన్ కాల్స్ వివరాలు ఆరా తీయగా మనోజ్, మురళీ పేర్లు వెలుగులోకి వచ్చాయి. వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విషయం బయటపెట్టారు. కాగా, వీరి నుంచి పేపర్లు ఖరీదు చేసిన ఏడుగురి కోసం గాలిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఆ ఏడుగురిలో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మిగిలిన ముగ్గురి కోసం వేట కొనసాగిస్తున్న సిట్ మనోజ్, మురళీలను కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించింది. కాగా, ఈ ఇద్దరి అరెస్టులతో కలిపి ఈ కేసులో ఇప్పటి వరకు కటకటాల్లోకి చేరిన వారి సంఖ్య 24కు చేరింది.

త్వరలో 'ఆదర్శ' ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: ఆదర్శ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందించినట్టు పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ తెలిపారు. మంత్రిని వారు సోమవారం కలిసి, పదేళ్లుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలకు నోచుకోలేదని వివరించారు. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన షెడ్యూల్ జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు పీఆర్‌టీయూటీఎస్ నేతలు తెలిపారు.

శరత్‌చంద్రారెడ్డి మధ్యంతర బెయిల్ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో శరత్‌చంద్రారెడ్డికి సీబీఐ ప్రత్యేక కోర్టు మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగించింది. గతంలో మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్ సమయం ముగియడంతో.. ఈ అంశంపై సోమవారం జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ధర్మాసనం విచారించింది. భార్య అనారోగ్యం రీత్యా మధ్యంతర బెయిల్ కోరుతూ శరత్‌చంద్రారెడ్డి దాఖలు చేసిన పిటిషన్, వైద్య పత్రాల తనిఖీ నివేదికపై ఈడీ కౌంటర్ ఇవ్వాల్సి ఉంది. కానీ వైద్యపరమైన కారణాలతో శరత్‌చంద్రారెడ్డికి హైకోర్టు రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ ఉత్తర్వులు హైకోర్టు ఇంకా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. ఈ నేపథ్యంలో పరిణామాలు దృష్టిలో ఉంచుకొని శరత్‌చంద్రారెడ్డికి గతంలో షరతులను వర్తింపజేస్తూ మధ్యంతర బెయిల్‌ను ఈ నెల 16 వరకూ పొడిగిస్తున్నామని.. ఈలోగా హైకోర్టు ఉత్తర్వు ప్రతి అందజేస్తే స్వీకరిస్తామని స్పష్టం చేస్తూ జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

1331 ఉద్యోగాల క్రమబద్ధీకరణపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ఏడు విభాగాల్లో 1,331 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో టీఎన్‌జీఓ అధ్యక్షుడు ఎం.రాజేందర్, హెచ్–1 యూనియన్ అధ్యక్షుడు కె.సాయిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, ఆర్థిక, వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో తమ శాఖ మరింత బలోపేతమైందని, వైద్య సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు ఉద్యోగులు కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘ నాయకులు జి.రాజశేఖర్, మంచాల రవీందర్, లాలు, రామారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

పాలమూరు: ఆపదలో ఉన్నవారిని ఆదరిస్తూ.. వారికి తగిన చేయూతనందిస్తూ.. దాతృత్వానికి నిదర్శనంగా నిలుస్తున్న రెడ్‌క్రాస్ సేవలు అద్భుతమని పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీ డ్యూనాట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరించారు. మొదట కేవలం 5 దేశాలకే పరిమితమై రెడ్‌క్రాస్ సేవలు కాలక్రమేణా ప్రస్తుతం 190 దేశాలకు విస్తరించడం అభినందనీయమన్నారు. ప్రపంచ యుద్ధ సమయాల్లో రెడ్‌క్రాస్ సంస్థ పోషించిన పాత్ర గొప్పదన్నారు. ఆపదలో ఉన్న వారికి కేవలం రక్తాన్ని సమకూర్చడమే కాకుండా అనేక రకాలుగా సేవలందిస్తున్న మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జూనియర్ రెడ్‌క్రాస్ ద్వారా సేవలు అందిస్తున్న సమన్వయకర్తలు చంద్రశేఖర్, బాలలింగయ్య, అశోక్‌కుమార్, రాజేశ్వరిలకు గవర్నర్ అందించిన సర్టిఫికెట్స్ బహూకరించారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి జగపతిరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఖిల్లాఘనపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని రామచంద్ర మిషన్ జోనల్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సెంట్రల్ కోఆర్డినేటర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, రామచంద్ర మిషన్ సంస్థ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యోగా మహోత్సవం నిర్వహించారు. జెడ్పీటీసీ సామ్యనాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, సర్పంచ్ వెంకటరమణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోజూ ఉదయం, సాయంత్రం కొంత సేపు యోగా చేసుకోవడం వలన బీపీ, మధుమేహం, ఒత్తిడి, ఊబకాయం, థైరాయిడ్ తదితర వ్యాధులు దూరమవుతాయన్నారు. ఆస్పత్రుల్లో చేరి రూ.లక్షలు వృథా చేయడం కంటే ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానం, యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం బ్రెయిన్ మైండ్ కార్యక్రమంలో భాగంగా ఓ విద్యార్థి కళ్లకు గంతలు కట్టి చేతికి ఇచ్చిన వస్తువు కలర్, నంబర్ తదితర వివరాలను అక్కడికి వచ్చిన ప్రజలకు గుర్తించి చూపారు. యోగా కార్యక్రమం 10వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేందర్, రమణ, పలువురు యువకులు, మహిళలు పాల్గొన్నారు.



యోగా మహోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు వద్దు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కిష్టారెడ్డిపేట అలయ భూమిలో అక్రమ నిర్మాణ పనులు నిలిపివేయాలని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ తేజస్‌నందు లాల్ పవర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. వేణుగోపాలస్వామి ఆలయ భూమి సర్వే నంబర్లు 225, 337, 354లలో మొత్తం 9 ఎకరాల 36 గుంటల భూమిలో కొంత భూమిని గ్రామానికి కొందరు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని గృహనిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయ భూమిని ఇతరుల పేరు మీదికి ఎలా పట్టా చేశారని, అనుమతులు ఎలా ఇచ్చారని సంబంధిత స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు పూర్తి సమాచారంతో ధ్రువపత్రాలు తమకు ఇవ్వాలని, అలాగే 337 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆక్రమణదారుల నుంచి భూమిని జప్తు చేసుకొని వేణుగోపాలస్వామి ఆలయ పేరు మీదికి మార్చాలని కోరారు. ఇలాంటి దురాగతాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలను గుర్తించి ఇదే ఆలయ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు

డ్రైవర్‌కు గుండెపోటు.. ఆస్పత్రి వరకు బస్సు నడిపిన కండక్టర్





యమునప్ప మృతదేహం, కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు

మహబూబ్‌నగర్ క్రైం: కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కండక్టర్ బస్సును మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లో వెళ్తే.. కర్ణాటకకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని హొస్పెట్ ప్రాంతానికి బయలుదేరింది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌కు వచ్చిన తర్వాత బస్సు డ్రైవర్ యమునప్ప(58) గుండెపోటు రావడంతో గమనించిన.. బస్సు కండక్టర్ జోగి బస్సును తిరిగి మళ్లీ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. డ్రైవర్ యమునప్పను ఆస్పత్రిలో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ఆ సమయంలో బస్సులో దాదాపు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భూత్పూర్: మండలంలోని ఆదివారం సాయంత్రం కొత్త మొల్గర సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో చోటు చేసుకుంది. ఇందులో మండలంలోని కప్పెటకు చెందిన వడ్డె భాస్కర్, అతని కూతురు పావని మృతి చెందగా, భార్య సంధ్య తీవ్రగాయాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎల్కిచర్లకు చెందిన ఖాసీం మృతి చెందగా, వారి అంత్యక్రియలు కప్పెట, ఎలికిచర్లలో గ్రామస్తులు, బంధువులు అశ్రునయనాల మధ్య సోమవారం నిర్వహించారు. అంత్యక్రియలకు భారీ ఎత్తున గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తరలివచ్చారు. కాగా వడ్డె భాస్కర్, పావని రెండు కళ్లు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రిలో భాస్కర్ తల్లిదండ్రులు శాంతమ్మమ, వెంకటయ్య నేత్రదానం చేసేందుకు అంగీకరించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలోనే మృతుల నేత్రాలను దానం చేయడంతో పలువురు ప్రశంసించారు.

కుటుంబసభ్యులను ఆదుకోవాలి

వడ్డె భాస్కర్ మహబూబ్‌నగర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో కూతురు పావనితో పాటు మృత్యువాత గురికావడంతో పాటు ఏడు నెలల కుమారుడు, భార్య ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టిమిట్టాడుతుంది. భార్య, కుమారుడిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు: ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తరచూ చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాద స్థలాలను(బ్లాక్ స్పాట్) సోమవారం సాయంత్రం ఎస్పీ నరసింహ పరిశీలించారు. ప్రధానంగా అమిస్తాపూర్, గోప్లాపూర్, కొత్త మొల్గర, వెలికిచర్ల సమీపంలోని ప్రమాదాల తీరును పరిశీలించారు. ప్రమాదాలకు కారణాలు తెలుసుకుని ఇకపై ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి ఆదేశించారు. ఆ తర్వాత ఆయా గ్రామాల్లో ఎస్పీ స్వయంగా పర్యటించి గ్రామాల్లో అవసరమైన చోట సీసీ కెమెరాలు, బల్బులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, దీంతో పాటు హెల్మెట్ లేకుండా, ర్యాష్ డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట సీఐ రజితారెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

పెద్దచెరువులో మొసలి సంచారం

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువులో మొసలి సంచరిస్తుండటంతో మత్స్యకారులతో పాటు రైతులు, పశువుల కాపరులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల క్రితం భూత్పూర్ రిజర్వాయర్ కాల్వ ద్వారా మండల కేంద్రంలోని చెరువుకు వస్తున్న సాగునీటితో పాటు కాల్వ వెంట మొసలి వచ్చుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రస్తుతం చెరువులో నీటి నిల్వ తగ్గడంతో మొసలి ఒడ్డుకు వచ్చి మేకలు, గొర్రెలను లాక్కెలుతుందని తెలిపారు. మూడు రోజుల కిందట పట్టణానికి చెందిన గొర్రెల కాపరి గొర్రెలకు నీటిని అందించడానికి చెరువు సమీపంలోకి తీసుకెళ్లాడు. అప్పటికే మాటు వేసిన మొసలి ఒక్కసారిగా దాడి చేయడంతో గొర్రెలు అక్కడి నుంచి చెల్లాచెదురుగా పారిపోయాయి. గొర్రెను పట్టుకుని వెళ్తున్న మొసలిని కాపరి వెంబడించి కర్రలు, రాళ్లతో కొట్టారు. అప్పటికే రక్తం అధికంగా పోవడంతో గొర్రె మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులు స్పందించి మొసలిని పట్టుకెళ్లాలని కోరుతున్నారు.



అమరచింత పెద్ద చెరువు ఒడ్డున ఉన్న మొసలి